సాక్షి
పార్వతీపురం మన్యం

శుక్రవారం । 26 । సెప్టెంబర్ । 2025



మన ఊరు బాగుచేసుకుందాం

రోజుకో గంట కేటాయించి మన ఊరును బాగుచేసుకుందామని కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి పిలుపునిచ్చారు. -10లో



వెబ్‌ల్యాండ్‌లో తప్పులు సరిచేయాలి -10లో

వెబ్‌ల్యాండ్‌లో రెవెన్యూ పరమైన తప్పులు సరిచేయాలని జేసీ ఆదేశించారు.



నేరగాళ్లపై ఉక్కుపాదం మోపండి

నేరాల నియంత్రణపై దృష్టిసారిస్తూ నేరగాళ్లపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ మాధవ్ రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. -10లో

న్యూస్‌రీల్


కన్నతండ్రినే కడతేర్చాడు..



హత్యకు గురైన నాయుడుబాబు (ఫైల్)

బొండపల్లి: ఒక్కగా నొక్క కొడుకును అల్లారుముద్దుగా పెంచారు. ప్రయోజకుడయ్యాక ఓ ఇంటివాడిని చేశారు. కష్టాల్లో ఆదుకుంటాడని భావించారు. చివరకు కన్నతండ్రి ఆరోగ్య కష్టాలను పట్టించుకోకుండా ఆస్తి కోసం దారుణంగా హతమార్చిన ఘటన బొండపల్లి మండలం కొండకిండాం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ యు.మహేష్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండకిండాం గ్రామానికి చెందిన పెద్దమజ్జి నాయుడుబాబు(72), సత్యవతి దంపతులకు ఒక్కగానొక్క కొడుకు గణేష్‌కుమార్. ఆయన తన భార్యతో కలిసి వేపాడలో నివసిస్తూ అక్కడ ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. నాయుడుబాబు ఆరోగ్యం ఇటీవల క్షీణించింది. నడవలేని స్థితిలో కాళ్లకు శస్త్ర చికిత్స అవసరం కావడంతో డబ్బుల కోసం కొడుకును సంప్రదించాడు. ససేమిరా అనడంతో ఆస్పత్రి ఖర్చుల కోసం కొంత భూమిని అమ్మకానికి పెట్టాడు. భూమిని కొనుగోలుచేసిన వారు డబ్బులు ఇవ్వడంతో ఆపరేషన్ కోసం ఆస్పత్రిలో చేరేందుకు సన్నద్ధమవుతున్నాడు. ఇదే విషయంపై తండ్రితో కొడుకు పలుసార్లు గొడవకు దిగాడు. ఈ వయసులో ఆపరేషన్ ఎందుకంటూ ప్రశ్నించాడు. కొడుకు నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలంటూ మృతుడు బొండపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుకూడా చేశారు. ఈ క్రమంలో ఆస్తి విషయమై తండ్రీకొడుకుల మధ్య గురువారం రాత్రి మాటామాటా పెరిగింది. మారణాయుధంతో తండ్రిపై కొడుకు దాడి చేయడంతో అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు విడిచాడు. తండ్రి చనిపోయాక కొడుకు పరారయ్యాడు. సమాచారం అందుకున్న గజపతినగరం సీఐ జీఏవీ రమణ, ఎస్సై మహేష్, క్లూస్ టీం ఘటనా స్థలాన్ని పరిశీలించింది. హత్యకు గల కారణాలపై ఆరా తీసింది. హత్యకు ఉపయోగించిన మారణాయుధాన్ని స్వాధీనం చేసుకుంది. భర్త మృతితో భార్య సత్యవతి కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. ఆదుకుంటాడనుకుంటే హతమార్చాడంటూ రోదిస్తోంది.

కూటమిలో మైనింగ్ కుంపటి



- ఎమ్మెల్యే వర్సెస్ జనసేన
- శాసన సభ్యుడు విజయ్‌చంద్ర తీరుతో విసిగిపోతున్న జనసేన కార్యకర్తలు
- బహిరంగంగానే విమర్శలు
- నియోజకవర్గంలో సమస్యలపై పోరాడతామని హెచ్చరిక

సాక్షి, పార్వతీపురం మన్యం:

ఎన్నికల ముందు వరకు కూటమి.. ఎన్నికల తర్వాత కుంపటిలా మారింది జిల్లాలో 'తమ్ముళ్లు'.. జనసేన కార్యకర్తల పరిస్థితి. గత సార్వత్రిక ఎన్నికలు ముగిసిన దగ్గర నుంచి అటు టీడీపీ.. ఇటు జనసేన విడివిడిగా.. ఇంకా చెప్పాలంటే బద్ధశత్రువుల మాదిరి ఉంటున్నాయి. జనసేన నాయకులు, కార్యకర్తలను తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు పట్టించుకోకపోవడమే ఇందుకు కారణం. ఏ కార్యక్రమాలకూ వారిని ఆహ్వానించడం లేదు. పాలకొండలో జనసేన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తుండడంతో అక్కడ పరిస్థితి కాస్త భిన్నం. అక్కడా టీడీపీ వర్సెస్ జనసేన మాదిరి పరిస్థితి ఉన్నా.. ఎమ్మెల్యే కావడంతో వివాదం మరోలా నడుస్తోంది. ఇక.. పార్వతీపురం నియోజకవర్గంలో జనసేన శ్రేణుల ఆచూకీ లేకుండా చేస్తున్న పరిస్థితి. తమను ఏనాడూ ఎమ్మెల్యే కలుపుకొని వెళ్లడం లేదని బహిరంగంగానే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు పార్టీ గెలుపుకోసం ఎంతో శ్రమించామని.. ఇప్పుడు కూరలో కరివేపాకు మాదిరి తమ పరిస్థితి అయిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనసేన పార్టీ పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాడ మోహనరావు అయితే.. వీలు చిక్కినప్పుడల్లా ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర తీరును ఏకిపారేస్తున్నారు.

మరింతగా చిచ్చు పెట్టిన మైనింగ్..

జిల్లాలో మైనింగ్ మాఫియా బరి తెగిస్తున్న విషయం విదితమే. ఇప్పటికే బడిదేవరకొండ, ఆత్యం మైనింగ్, వెలుగులమెట్ట తవ్వకాల అంశం వివాదంగా మారింది. దీనిపై స్థానికులు పెద్ద ఎత్తున పోరాటం చేస్తున్నా.. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు స్పందించిన దాఖలాలు లేవు. ప్రధానంగా పార్వతీపురం మండలంలోని బడిదేవరకొండ మైనింగ్ తవ్వకాల విషయంలో ఆది నుంచి పెద్ద వివాదమే జరుగుతోంది. వామపక్షాలు, గిరిజన సంఘాలు పోరాటం చేస్తున్నాయి. తమ ఆరాధ్యదైవం కొలువుండే కొండను నాశనం చేయవద్దని గిరిజనులు వేడుకుంటున్నారు. అప్పట్లో జనసేన ఇన్‌చార్జి ఆదాడ మోహనరావు ఆధ్వర్యంలో కార్యకర్తలు దీనిపై పోరాటం చేశారు. అధికారులకు వినతిపత్రాలు అందించారు. స్థానికుల, గిరిజనుల మనోభావాలను ఆ సమయంలో పట్టించుకోకుండా, నోరు మెదపని ఎమ్మెల్యే విజయ్‌చంద్ర.. ఇటీవల కొండ వద్దకు వెళ్లి హడావిడి చేశారు. టీడీపీ నాయకులకు అందాల్సిన మామూళ్లలో తేడాలు రావడం వల్లే కొత్త నాటకాలకు తెర తీశారన్న విమర్శలూ వచ్చాయి. ఇప్పుడు ఇదే విషయమై పోరాటం ఉద్ధృతం చేస్తామని జనసేన కార్యకర్తలు హెచ్చరిస్తున్నారు. తమ పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కూడా జిల్లాలో జరుగుతున్న మైనింగ్ మాఫియాను లిఖితపూర్వకంగా వివరించామని ఆదాడ మోహనరావు తెలిపారు. రెవెన్యూ, మైనింగ్, అటవీశాఖాధికారులు.. అవినీతి అక్రమాల మత్తులో, స్థానిక రాజకీయ నాయకుల అండదండలతో ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా తప్పుడు నివేదికలు అందిస్తున్నారని ఆయన ఆరోపించారు. మైనింగ్ మాఫియాకు నాయకులే సహకరిస్తున్నారని పరోక్షంగా ఎమ్మెల్యేపై విమర్శల బాణం ఎక్కుపెట్టారు. ఎక్కడైనా తప్పు జరిగితే వెంటనే ప్రశ్నించాలని.. మైనింగ్ జరిగిన ఆరు నెలల తర్వాత హడావిడి చేయడమేమిటని ఇటీవల బడిదేవరకొండకు వెళ్లి హంగామా చేసిన ఎమ్మెల్యేను ఉద్దేశించి నర్మగర్భంగా వ్యాఖ్యానించారు. బేరానికి ముందుకు వెళ్లే నాయకులు ఉన్నంత వరకు ఇలాగే ఉంటుందన్నారు. ఎప్పుడూ లేని విధంగా మైనింగ్ మాఫియా ఈ ప్రభుత్వ అండదండలతో ఎందుకు రెచ్చిపోతుందో చెప్పాలని ప్రశ్నించారు.

పార్వతీపురం నియోజకవర్గంలో అభివృద్ధిపైనా విమర్శలు

కొంతకాలంగా పార్వతీపురం నియోజవర్గంలో అభివృద్ధి జరగడం లేదని జనసేన కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గానికి వస్తున్న నిధులు ఎక్కడికి వెళ్తున్నాయంటూ బహిరంగంగానే ఆదాడ మోహనరావు వంటి నాయకులు ప్రశ్నించారు. పార్వతీపురం డంపింగ్‌యార్డు సమస్య అలానే ఉండిపోయిందని.. వార్డుల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందని చెప్పారు. ఈ సమస్యలపై త్వరలో ప్రజల్లోకి వెళ్లి పోరాటం చేస్తామని కూటమి ప్రభుత్వంలో భాగమైన జనసేన నాయకులు ప్రకటించడం గమనార్హం. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే డంపింగ్‌యార్డు సమస్యను పరిష్కరిస్తానని విజయ్‌చంద్ర గతంలో పలు సందర్భాల్లో చెప్పుకొచ్చారు. ఇప్పటికీ అమలు చేయలేకపోయారు. ఇప్పుడు నియోజకవర్గంలో టీడీపీ వర్సెస్ జనసేన మాదిరి పరిస్థితి ఉంది. సొంత పార్టీ సీనియర్ నేతలనే పక్కన పెట్టేసిన వారికి.. ఇంక తామెంత అంటూ నియోజకవర్గంలోని జనసేన నాయకులు, కార్యకర్తలు రగిలిపోతున్నారు.

సమష్టి కృషితోనే అగ్రస్థానం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి

పార్వతీపురం రూరల్: ఆశావాహ జిల్లాల అభివృద్ధిలో వరుసగా రెండోసారి దక్షిణ భారత దేశంలోనే పార్వతీపురం మన్యం జిల్లా నీతిఆయోగ్ జూన్–2025 నెలకు డెల్టా ర్యాంకింగ్స్‌లో ప్రథమ స్థానంలో నిలిచిందని, ఇది అధికార యంత్రాంగం సమష్టి కృషికి నిదర్శనమని కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి తెలిపారు. నీతి ఆయోగ్ నుంచి రూ.1.5 కోట్ల రివార్డు ప్రకటించినట్లు కలెక్టర్ చెప్పారు. గత ర్యాంకుతో కలిపి ఇప్పటివరకు జిల్లాకు రూ.3 కోట్లు నిధులు అందాయన్నారు. జిల్లా ప్రజల జీవన ప్రమాణాల మెరుగుకోసం నిధులు వినియోగిస్తామని తెలిపారు.

క్రీడలకు పెద్దపీట వేయాలి

జిల్లాలోని అన్ని ప్రభుత్వ విద్యా సంస్థల్లో క్రీడలకు పెద్దపీట వేయాలని, క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని కలెక్టర్ డా.ఎన్.ప్రభాకరరెడ్డి అధికారులను ఆదేశించారు. పంచాయతీ రాజ్, క్రీడలు, సంక్షేమశాఖలకు సంబంధించిన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతీ ప్రభుత్వ విద్యాసంస్థలో రోజుకు ఒక గంట క్రీడలకు కేటాయించాలని స్పష్టం చేశారు. విద్యార్థులతో జట్లు ఏర్పాటు చేసి ప్రతివారం పోటీలు నిర్వహించాలన్నారు. జిల్లాకు హాకీని పరిచయం చేయడంతో పాటు ఆర్చరీ, ఫెన్సింగ్, జూడో, రెజ్లింగ్, స్విమ్మింగ్ వంటి క్రీడల్లో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన వారికి ప్రత్యేక కోచ్‌లతో శిక్షణ అందించి జాతీయ స్థాయిలో పతకాలు సాధించేలా ప్రోత్సహించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు పదెకరాల స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు పంపాలన్నారు. పదో తరగతి, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులను గుర్తించి ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జేసీ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, ఐటీడీఏ పీఓ ఎ.మురళీధర్, డీఎస్‌డీఓ కె.శ్రీధర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

విజయనగరం/నెల్లిమర్ల: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీలు పెనుమత్స సురేష్ బాబు, పాలవసల విక్రాంత్, ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పలు రాజకీయ అంశాలపై చర్చించారు. సిరిసహస్ర తన సంస్థ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలను జగన్ మోహన్‌రెడ్డికి వివరించారు.



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన మజ్జి శ్రీనివాసరావు, సిరి సహస్ర, ఎమ్మెల్సీలు డాక్టర్ సురేష్‌బాబు, పాలవలస విక్రాంత్

కోటి దండాలు దండాలి



- ఉత్సవం పేరిట వసూళ్ల దందా...!
- పైడితల్లి ఉత్సవాలు చేయాలి... చందాలు ఇవ్వండి
- పలు శాఖలకు బాధ్యతలు అప్పగింత
- ఇదే అదునుగా అడ్డుగోలు దందాకి తెరలేపిన అధికారులు!

సాక్షిప్రతినిధి విజయనగరం:

తిండిపోతును మిఠాయి కొట్లో వదిలేసినట్లు.. తిరుగుబోతును పోలేరమ్మ జాతరలో వదిలేసినట్లు... తాగుబోతును ఫ్రీ బార్‌లో వదిలేసినట్లు.. అప్పడు కోయిడ్లను పంటపొలాల మీద వదిలేసినట్లు విజయనగరం రెవెన్యూ, మున్సిపల్ అధికారులను జిల్లా యంత్రాంగం పండగ పేరిట ఊరిమీద వదిలేసింది. దీంతో వారు అమ్మవారి పండగను భలే ఎంజాయ్ చేస్తున్నారు. లోలోన అయ్యో మా మీద ఒత్తిడి పెట్టేశారు అని నంగనాచి ఏడుపులు ఏడుస్తూనే... 'పెడితే పెట్టారు లేరా చారీ.. మనకు బాగానే గిట్టుబాటు అవుతుందిగా' అని లోలోన సంబరపడుతున్నారు. అది ఒత్తిడి కాదు ఆఫర్ అని లోలోన వాళ్లే సంబరపడుతున్నారు.

జాతర పేరుతో...

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా విజయనగరంలో విజయనగర ఉత్సవాలు, సిరిమాను జాతర... అన్నీ కలిపి అంబరాన్ని అంటేలా నిర్వహించడం ఏళ్ల తరబడి వస్తున్న ఆనవాయితీ. ఈ పండగ సందర్భంగా పలు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు, కళారూపాల ప్రదర్శన, వివిధ నాటకాలు... రంగస్థల పోటీల వంటి వాటిని నిర్వహిస్తారు. దీనికి భారీ ఎత్తున డబ్బు ఖర్చు అవుతుంది. ప్రభుత్వం నుంచి కేవలం రాష్ట్ర పండగగా ప్రకటన మాత్రమే వస్తుంది తప్ప డబ్బు మాత్రం రాని పరిస్థితి. దీంతో ఈసారి చందాల పేరిట సరిగ్గా కోటి వసూలు చేయాల్సిందిగా జిల్లా పెద్దలు మున్సిపల్ రెవెన్యూ కమర్షియల్ ట్యాక్స్ ఎక్సైజ్ తదితర విభాగాల అధికారులపై ఒత్తిడి పెట్టారు. తమపై ఒత్తిడి పెట్టారని వారు అంటున్నా..

అప్పుడు లేదు.. ఇప్పుడే...

వాస్తవానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఈ చందాల ప్రక్రియ లేదు. పార్టీ నాయకులు మజ్జి శ్రీనివాసరావు, అప్పటి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, మంత్రి బొత్స సత్యనారాయణ వంటి వారు నిధులు కొరత లేకుండా చేసి పండగను ఘనంగా నిర్వహించే వారు. అయితే, ఇప్పుడు మాత్రం అదేం లేకుండా కచ్చితంగా కోటి రూపాయలు కలెక్ట్ చేయాల్సిందే అంటూ వివిధ శాఖలకు జిల్లా అధికారుల నుంచి సూచనలు, టార్గెట్లు వచ్చాయి.

లెక్కాపత్రం ఉండదుగా...

కోటి కలెక్షన్ అన్నది బాగానే ఉంది కానీ దానికి లెక్కాపత్రం లేనేలేదు. ఇదే అదనుగా సదర అధికారులు రియల్ ఎస్టేట్, బిల్డర్స్, మద్యం షాపులు.. బార్లు.. బిల్డర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, లాడ్జిలు ఇతరత్రా హోల్‌సేల్ డీలర్లు, కిరాణా, చాంబర్ ఆఫ్ కామర్స్ ఇలా వివిధ వర్గాల నుంచి భారీగా దండుకోవడానికి స్కెచ్ వేశారు. వామ్మో మేము కోటి రూపాయలు కలెక్ట్ చేయాలా అని బయటికి నటిస్తూనే లోలోన భయ్యా ఎలాగైనా ఓ మూడు కోట్లు లేపేద్దాం. మనకి కూడా ఖర్చులు ఉంటాయి కదా అన్నట్లుగా వాళ్లలో వాళ్లు కూడబలుక్కుని ఇష్టానుసారం దండడానికి బయల్దేరారు. హోటళ్లు.. రెస్టారెంట్లు.. ఎలక్ట్రానిక్స్ డీలర్స్.. క్లాత్ మర్చంట్స్.. హార్డ్ వేర్.. పెద్ద స్థాయి ఆస్పత్రులు.. కాంట్రాక్టర్లు.. ఇలా ఏ ఒక్కరిని కూడా వదలడం లేదు. ఇదిలా ఉండగా పండగ పేరు చెప్పుకుని కొంతమంది కింది స్థాయి ఉద్యోగులు వీధి వ్యాపారులు, చిన్నచిన్న హోటళ్లు.. చిరు వ్యాపారులను సైతం వదలడం లేదు. అసలు కలెక్ట్ చేయాల్సింది కోటి రూపాయలు కాగా.. దీనికి లెక్కాపత్రం లేకపోవడంతో అధికారులు ఆ నెపంతో ఇష్టానుసారం నొల్లేస్తున్నారన్న ఆరోపణలు మొదలయ్యాయి.

భలే చందాల వ్యాపారం

కోటి రూపాయలు బాధ్యత మా మీద ఉంది అని ఓవైపు విపరీతమైన కష్టాన్ని బాధని నటిస్తూనే... సొంత టార్గెట్లు కూడా పూర్తి చేసుకునే పనిలో రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ అధికారులు ఉన్నట్లు నగరంలో చర్చసాగుతోంది. అధికారంలో ఉన్న టీడీపీ నాయకులు ఈ పండగను ఘనంగా నిర్వహించాల్సి ఉండగా వారు పూర్తిగా చేతులెత్తేసి వ్యవహారం మొత్తాన్ని అధికారుల చేతుల్లో పెట్టడంతో వారు ఇలా ఇష్టానుసారం వ్యవహరిస్తూ కలెక్షన్లు మొదలు పెట్టినట్లు సమాచారం. దీనికి తోడు జిల్లాలో చాలామంది అధికారులు కొత్త వాళ్లే కావడంతో ఏం చేస్తున్నారో.. ఏం జరుగుతుందో కూడా అర్థం కాని పరిస్థితి. ఈ క్రమంలోనే సిరిమాను చెట్టును తీసుకొచ్చేటప్పుడు ఎడ్లబండి ఇరుసు విరిగిపోవడంతో సిరిమాను చెట్టు పట్టణానికి రావడానికి మూడు నాలుగు గంటల ఆలస్యం అయింది. ఇలాంటి అపశృతుల నడుమ పండగను ఎలా నిర్వహిస్తారు అన్నదానిపై ప్రజల్లో కూడా బోలెడు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఏది ఎలా ఉన్నా అమ్మవారికి కోటి దండాలు అని ప్రజలు అనుకుంటుండగా.. రూ.కోట్లు దండేయాలి అని అధికారులు భావిస్తున్నారట.

క్లుప్తంగా

వృద్ధురాలి మృతి



నల్లకాంతం దమయంతి (ఫైల్)

గరుగుబిల్లి: మండలంలోని శివ్వాం గ్రామ పరిసరాల్లో నాగావళి నది ఒడ్డున గురువారం ఉదయం ఓ వృద్ధురాలి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. దీనికి సంబంధించి స్థానిక ఎస్సై ఫక్రుద్దీన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రావుపల్లి గ్రామానికి చెందిన నల్ల కాంతం దమయంతి(59) కొన్నేళ్లుగా మతిస్థిమితం లేకపోవడంతో రావుపల్లి, శివ్వాం గ్రామాల్లో ఉంటూ జీవనం సాగిస్తోంది. ఆమెకు భర్త, పిల్లలు లేకపోవడంతో ఒంటరిగానే ఉంటోంది. నాలుగు రోజుల నుంచి రావుపల్లిలో గాని, శివ్వాంలో గాని కనిపించకపోవడంతో మృతురాలి అన్నయ్య చంద్రరావు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన మేరకు పోలీసులు గాలించి గురువారం శివ్వాం గ్రామపరిధిలో నాగావళి నది ఒడ్డున మృతదేహాన్ని గుర్తించారు. శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నటు ఎస్సై తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి



ఈశ్వరరావు (ఫైల్)

లక్కవరపుకోట: మండలంలోని అరకు–విశాఖ జాతీయ రహదారిలో మల్లివీడు జంక్షన్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వనం ఈశ్వరరావు(57) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై నవీన్‌పడాల్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. కొత్తవలస మండలం చిన్నిపాలెం గ్రామానికి చెందిన ఈశ్వరరావు తన సమీప బంధువు ఎస్.రామకృష్ణతో కలిసి మండలంలోని లింగంపేట గ్రామంలో జరుగుతున్న పూజా కార్యక్రమానికి వెళ్తుండగా మల్లివీడు జంక్షన్ వద్దకు వచ్చేసరికి కుక్క అడ్డంగా రావడంతో బైక్ అదుపు తప్పి ఇద్దరూ పడిపోయారు. దీంతో బైక్ వెనుక కూర్చున్న ఈశ్వరరావు తీవ్ర గాయాలు పాలవగా విశాఖ కేజీహెచ్‌కు తరలించాచగా చికిత్స పొందుతూ మృతి చెందాడని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని..ఒకరికి తీవ్ర గాయాలు



అంబులెన్స్‌లో తీవ్ర గాయాలతో భాస్కరరావు

పాచిపెంట: మండలంలోని కోడికాళ్ల వలస సమీపంలో గురువారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన కనకల భాస్కరరావు(31) ఉదయం 10 గంటల సమయంలో కోడికాళ్ల వలస సమీపంలో ఉన్న తమ పొలానికి వెళ్లి పశువులకు దానా కోసం తన ద్విచక్ర వాహనంతో రోడ్డు పైకి వస్తున్న సమయంలో, మండలంలోని గోగాడవలస గ్రామానికి చెందిన 18 సంవత్సరాల లోపు ఉన్న ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై అతివేగంతో వచ్చి బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కనకల భాస్కరరావుకు తీవ్ర గాయాలయ్యాయి, వెంటనే స్థానికులు పాచిపెంట పీహెచ్‌సీకి తరలించగా, అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం సాలూరు ఏరియా ఆస్పత్రికి అక్కడి నుంచి విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు.

బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు

గుమ్మలక్ష్మీపురం: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొనడంతో జరిగిన ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. గుమ్మలక్ష్మీపురం మండలం రెల్ల గ్రామానికి చెందిన ఎం.మనోహర్ గుమ్మలక్ష్మీపురంలో పనులు ముగించుకుని ద్విచక్రవానంపై రెల్ల గ్రామానికి వెళ్తున్నాడు. అలాగే టొబ్బన్న గ్రామంలో పనులు ముగించుకుని గుమ్మలక్ష్మీపురం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న జీడిమామిడిగూడ గ్రామానికి చెందిన ఆరిక మోహన్, వంతరగూడ గ్రామానికి చెందిన ఆరిక ఫిలిప్‌లు ఎదురెదురుగా కొత్తగూడ గ్రామం సమీపంలో ఢీకొట్టుకున్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన ముగ్గురిని గమనించిన స్థానికులు భద్రగిరి ఆస్పత్రికి తరలించగా వైద్యసేవలు పొందుతున్నారు.

మన ఊరు బాగుచేసుకుందాం

- కలెక్టర్ రామ్‌సుందర్ రెడ్డి పిలుపు
- స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం ప్రారంభం
- 12 మంది పారిశుధ్య కార్మికులకు సత్కారం



పారిశుధ్య కార్మికులను సత్కరించి ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

విజయనగరం: రోజుకో గంట కేటాయించడం ద్వారా మన ఊరును బాగుచేసుకుందామని కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో గురువారం ఉదయం ఆయన ప్రారంభించారు. ముందుగా మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ విజయనగరం సాధించేందుకు కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం 12 మంది మున్సిపల్ పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కలెక్టరేట్‌ను 9 విభాగాలుగా విభజించి, వివిధ ప్రభుత్వ శాఖలకు అప్పగించడం ద్వారా పారిశుధ్య కార్యక్రమం నిర్వహించి శుభ్రం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా ఏక్ దిన్, ఏక్ గంటా, ఏక్ సాత్ నినాదంతో ముందడుగు వేయాలని కోరారు. కనీసం రోజుకో గంటపాటైనా సమాజానికి సేవ చేయడం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి కావాలని సూచించారు. మన ఇంటితోపాటు పరిసరాల పరిశుభ్రత కూడా ఎంతో ముఖ్యమన్నారు. దీనివల్ల పరిసరాలు శుభ్రంగా ఉండడంతో పాటు, పర్యావరణ పరిరక్షణ, వివిధ రకాల వ్యాధుల నివారణకు దోహదపడుతుందని సూచించారు. అందువల్ల ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మన ఊరు బాగుండాలంటే అందుకు మనమే ముందుడుగు వేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య మాట్లాడుతూ, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతిరోజు ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరిస్తున్నట్లు చెప్పారు. అయినప్పటికీ కొంతమంది చెత్తను పారిశుధ్య కార్మికులకు ఇవ్వకుండా, కాలువల్లోను, రోడ్ల పక్కన వేసేస్తున్నారన్నారు. ఈ అలవాటును మానుకోవాలని, కార్మికులు ఇంటివద్దకు వచ్చినప్పుడే చెత్తను అందజేయాలని సూచించారు. మన విజయనగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతిఒక్కరూ తమవంతు సహకారాన్ని అందజేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేసీ సేతుమాధవన్, డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, సీపీఓ పి.బాలాజీ, ఇతర అధికారులు, పలువురు నాయకులు, వివిధ శాఖల సిబ్బంది, మున్సిపల్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



చీపురుపల్లి కలక్టరేట్ పరిసరాలను శుభ్రం చేస్తున్న కలెక్టర్, జేసీలు

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

పార్వతీపురంటౌన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా పరిసరాలు అందంగా కనిపించడంతో పాటు ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటామని కలెక్టర్ డా.ఎన్.ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రం చేయాలని కోరారు. తద్వారా మన పట్టణం పరిశుభ్రంగా ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో గురువారం పట్టణ పరిధిలోని 8వ వార్డులో గల కొత్తవలస చెరువు వద్ద స్వచ్ఛత హి సేవ –2025లో భాగంగా ఏక్ దిన్..ఏక్ గంట..ఏక్ సాత్ స్వచ్ఛత కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని శ్రమదానం చేయగా, మునిసిపల్ ౘైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, కౌన్సిలర్ కోరాడ నారాయణరావు, కమిషనర్ జి.శ్రీనివాసరాజు భాగస్వామ్యమై శ్రమదానం చేసి చెరువు పరిసరాలను పరిశుభ్రం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణ మనందరి బాధ్యతగా గుర్తెరగాలని జిల్లా ప్రజలకు కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యువత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కొత్తవలస చెరువు వద్ద శ్రమదానంలో పాల్గొన్న కలెక్టర్ డాక్టర్ ఎం.ప్రభాకర్ రెడ్డి

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



రమేష్ మృతదేహం

వీరఘట్టం: తన చావుకు భార్యే కారణమని వీరఘట్టం మండలం కంబర పంచాయతీ పరిధి కాగితాడ గ్రామానికి చెందిన లింగందొర రమేష్(33) బుధవారం అర్ధరాత్రి మిత్రులు, బంధువులకు ఫోన్‌లో వాయిస్ మెసేజ్ పెట్టి గ్రామ శివారులో టేకు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తల్లిదండ్రులు సత్యందొర, సోములమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన లింగందొర రమేష్ ఉరఫ్ మురళి కొన్నేళ్లుగా అనకాపల్లి సమీపంలో ఓ చికెన్ షాపులో పనిచేస్తున్నాడు. అక్కడ పాలకొండ మండలం బర్న సీతంపేటకు చెందిన సుజాతతో పరిచయం ఏర్పడింది. ఆమెకు ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. గడిచిన తొమ్మిది నెలలుగా ఆమెతో సహజీవనం చేస్తూ భార్యగా అనుకున్నాడు. అయితే అక్కడ చికెన్ షాపులో రూ.40 వేలు అప్పు చేశాడు. ఆ డబ్బులను వారిద్దరూ సొంత అవసరాలకు వాడుకున్నారు. నెల రోజుల క్రితం వినాయక చవితికి ఆమెతో కలిసి స్వగ్రామానికి వచ్చాడు. అప్పటి నుంచి వారి మధ్య చిన్నచిన్న గొడవలు అవుతున్నాయి. తరచూ ఒకరిపై ఒకరు అనుమానం పెంచుకుని గొడవలు పడుతున్నారు. ఈ క్రమంలో చికెన్ షాపు యజమాని తరచూ ఫోన్ చేసి డబ్బులు కట్టమంటుండడంతో విసిగిపోయిన రమేష్ బుధవారం రాత్రి ఊరి శివారుకు వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో తన ఫోన్‌లో వాయిస్ రికార్డింగ్ చేసి తాను చనిపోతున్నట్లు మెసేజ్ పెట్టాడు. తెల్లవారి చూసేసరికి చెట్టుకు వేలాడుతుండడంతో ఇంటికి తీసుకువచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గురువారం ఉదయం ఏఎస్సై సత్యనారాయణ గ్రామానికి చేరుకుని ఈ మృతికి గల కారణాలపై తల్లిదండ్రులను, భార్యను ప్రశ్నించారు. గ్రామస్తుల నుంచి వివరాలు ఆరా తీశారు. అయితే భార్యాభర్తల మధ్య వచ్చిన మనస్పర్థల వల్లే రమేష్ ఆత్మహత్యకు పాల్పడినట్లు కేసు నమోదు చేశామని ఏఎస్సై తెలిపారు.

జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు పతకాలు



సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: జాతీయ స్థాయిలో జరిగిన సౌత్‌జోన్ జూనియర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు గుంటూరు జిల్లాలోని ఆచార్యనాగార్జున యూనివర్సిటీలో జరిగిన పోటీల్లో 8 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించగా,, ముగ్గురు క్రీడాకారులు నాలుగు పతకాలు దక్కించుకున్నారు. పోటీల్లో పి.వసంత 200 మీటర్ల పరుగు పోటీలో కాంస్య పతకం, 400 మీటర్ల రిలే పరుగు పోటీలో మరో కాంస్య పతకం కైవసం చేసుకుంది. అలాగే క్రీడాకారిణి దివ్య 400 మీటర్ల రిలే పరుగు పోటీలో కాంస్య పతకం దక్కించుకోగా.. ఎం.హరీష్ 3000 మీటర్ల పరుగు పోటీల్లో కాంస్య పతకం సాధించాడు. సౌత్‌జోన్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన కోచ్‌లు సతీష్, మధు, శేఖర్‌లకు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.లీలాకృష్ణ, జి.శ్రీకాంత్, కోశాధికారి ఆనంద్ కిషోర్‌లు అభినందించారు.

ఉత్సాహంగా సైనిక్ స్కూల్ క్రీడా సంబరాలు



క్రీడాజ్యోతిని విద్యార్థికి అందిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్.ఎస్ శాస్త్రి

విజయనగరం రూరల్: కోరుకొండ సైనిక్ పాఠశాల వార్షిక క్రీడా సంబరాలు గురువారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. కోరుకొండ సైనిక్ పాఠశాల సైకోర్ స్పోర్ట్స్ మైదానంలో నిర్వహించిన 64వ వార్షిక అథ్లెటిక్స్ మీట్‌ను, పాఠశాల ప్రిన్సిపాల్ గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి ప్రారంభించారు. ఈ క్రీడా పోటీల్లో సైనిక పాఠశాలలోని శాతవాహన, చాళుక్య, గజపతి, గుప్తా, మొఘల్ హౌస్‌లకు చెందిన సీనియర్ విద్యార్థులు, అలాగే పాండ్య, మౌర్య, పల్లవ, కాకతీయ హౌస్‌లకు చెందిన జూనియర్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శాస్త్రి మాట్లాడుతూ క్రీడలు శారీరక మానసిక దృఢత్వానికి తోడ్పడతాయని, ప్రతి విద్యార్థి క్రీడాస్ఫూర్తి ప్రదర్శించి ఆడాలని సూచించారు.



షాట్‌పుట్ పోటీల్లో పోటీ పడుతున్న క్రీడాకారులు

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు సహకరించాలి

- డీఆర్‌ఓ కె.హేమలత



పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఆర్‌ఓ కె.హేమలత

పార్వతీపురం రూరల్: జిల్లాలో ఓటర్లకు సౌకర్యవంతంగా ఉండేలా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు రాజకీయ పార్టీలు సహకరించాలని డీఆర్‌ఓ కె.హేమలత కోరారు. ఈ మేరకు గురువారం ఆమె తన చాంబర్‌లో గుర్తింపు ఉన్న కొన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రం ఓటర్ల నివాసాలకు 2కి.మీ పరిధిలో, 800 నుంచి 1200మంది ఓటర్లు ఉండేలా ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఈ మేరకు ఎక్కడైనా మార్పులు, చేర్పులు అవసరమని గుర్తిస్తే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని పార్టీల ప్రతినిధులకు ఆమె సూచించారు. అదేవిధంగా పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీలో పార్టీల ప్రతినిధుల భాగస్వామ్యం కావాలని కోరారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు బూత్‌లెవెల్ ఏజెంట్‌ను నియమించాలని వారు బూత్‌లెవెల్ అధికారులతో కలిసి పనిచేసి ఓటరు జాబితాలోని తప్పులు సరిదిద్దడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. సమావేశంలో వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేరగాళ్లపై ఉక్కుపాదం మోపండి

- గంజాయి వ్యాపారస్తుల ఆస్తులు అటాచ్ చేయాలి
- ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేర సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: జిల్లాలో నేరాల నియంత్రణపై దృష్టిసారిస్తూ నేరగాళ్లపై ఉక్కుపాదం మోపాలని, అలాగే గంజాయి వ్యాపారంతో ఆస్తులు కూడబెట్టే వారిని గుర్తించి వారి ఆస్తులను అటాచ్ చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఎస్పీ మాధవ్ రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన జిల్లా పోలీసు అధికారులతో తన కార్యాలయం నుంచి జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన మాసాంతపు నేరసమీక్ష సమావేశంలో పలు కీలక ఆదేశాలు జారీచేశారు. తరచూ నేరాలకు పాల్పడేవారిపై హిస్టరీ షీట్లు తెరిచి, వారి కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో తప్పనిసరిగా ప్రతిరోజూ డ్రోన్ పోలీసింగ్ నిర్వహించాలని ఎస్పీ స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న హత్య, ఆస్తి, మహిళలపై నేరాల కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, బాధితులకు సత్వర న్యాయం అందించాలన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై కఠినంగా వ్యవహించాలని సూచించారు. సైబర్ నేరాలు, సోషల్ మీడియా కేసులపై ప్రత్యేక దృష్టిసారించి సాంకేతిక పరిజ్ఞానంతో కేసులను ఛేదించాలన్నారు. గంజాయి అక్రమ రవాణా. వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని పోలీసు అధికారులకు ఎస్పీ దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, డీసీఆర్‌బీ సీఐ ఆదాం, సోషల్‌మీడియా, సైబర్ సెల్ సీఐ శ్రీనివాసరావు, సీసీఎస్ సీఐ అప్పారావు, ఎస్బీ సీఐ రమేష్‌తో పాటు మరికొంతమంది అధికారులు పాల్గొన్నారు.

వెబ్ ల్యాండ్‌లో తప్పులు సరిచేయాలి

- రెవెన్యూ అధికారులను ఆదేశించిన జేసీ



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి

పార్వతీపురంటౌన్: జిల్లాలో రెవెన్యూ శాఖకు చెందిన సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, వాటిపై ప్రత్యేక దష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం పార్వతీపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలితో కలిసి రెవెన్యూ, రీసర్వే, వెబ్ ల్యాండ్ కేసులపై సంబంధిత అధికారులతో జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. మానవీయకోణంలో పరిష్కరించేందుకు కృషిచేయాలని చెప్పారు. రికార్డుల మేరకు సమస్యల పరిష్కారం ఉండాలని, పరిష్కారం కాని వాటిపై అందుకు గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. రీ సర్వే పక్కాగా ఉండాలని తేల్చిచెప్పారు. వెబ్ ల్యాండ్‌లో ఉన్న తప్పులు సరిచేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అధికారులను జేసీ ఆదేశించారు. ఇప్పటికే పార్వతీపురంలో జరిగిందని, పాలకొండలో కూడా నిర్వహించాలని జేసీ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని వ్యక్తికి గాయాలు



గంట్యాడ: మండలంలోని బుడతనాపల్లి గ్రామానికి చెందిన పంకుంతల తులసి అనే వ్యక్తి టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తుండగా గొడియాడ సమీపంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు మెరుగైన చికిత్స కోసం విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు.

ఏఓబీలో ఎక్సైజ్ దాడులు

- 730 లీటర్ల సారా, 9700 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామాల్లో స్వాధీనం చేసుకున్న బెల్లం ఊట నిల్వలు చూపుతున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

కురుపాం: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామాల్లో ఇరు రాష్ట్రాలకు చెందిన ఎక్సైజ్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన దాడుల్లో భారీగా సారా, సారా తయారీకి ఉంచిన బెల్లం ఊటను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేసినట్లు కురుపాం ఎక్సైజ్ సర్కిల్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మన్యం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.శ్రీనాథుడుడు, ఏఈఎస్ ఎ.సంతోష్‌ల ఆదేశాల మేరకు ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామాలు సందుబడి, రంబళబలబాయ్, రేగుల పాడులలో దాడులు నిర్వహించగా సారా తయారీ కోసం నిల్వ ఉంచిన 9700 లీటర్ల బెల్లం ఊట, విక్రయానికి సిద్ధంగా ఉంచిన 730 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఒడిశా సరిహద్దు నుంచి సారా రవాణా చేస్తున్న వారి పేర్లు, పూర్తి సమాచారం తమ వద్ద ఉందని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నిర్వాసితుల సమస్యపై ఎమ్మెల్యే మాట్లాడాలి



మూలబొడ్డవరలో ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

శృంగవరపుకోట: జిందాల్ నిర్వాసితుల సమస్యలను స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అసెంబ్లీ వేదికగా ప్రస్తావించాలని, ప్రభుత్వానికి తమ గోడు వినిపించాలని, గురువారం నాటి నిరసన కార్యక్రమంలో నిర్వాసితులు డిమాండ్ చేశారు. జిందాల్ యాజమాన్యం అక్రమంగా తమ భూముల్లో ప్రవేశించి యేళ్ల వయస్సున్న చెట్లు కొట్టించిందని, అన్యాయంగా భూములు ఆక్రమించి, అక్రమ కేసులు పెట్టి బెదిరించారని, పోలీసుల నిర్బంధంలో నిర్వాసితులను ఉంచి, గొంతు నొక్కేశారని వాపోయారు. జిందాల్ గతంలో ఇచ్చిన హామీలు ఏమీ అమలు చేయకుండా, భూములు ఇచ్చిన రైతులను రోడ్డున నెట్టారన్న నిజాలను అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రస్తావించాలని నిర్వాసితులు కోరారు.

జీఎస్టీ తగ్గించినా తగ్గని సరుకుల ధరలు

సీతానగరం: కేంద్రప్రభుత్వం నిత్యావసర సరకుల ధరలు, తినుబండారాలపై జీఎస్టీ తగ్గించి అమలులోకి తెచ్చినా సరుకుల ధరలు యథాతథంగా ఉన్నాయని కొనుగోలు దారులు అంటున్నారు.పప్పులు, సబ్బు బిళ్లలు నిరంతరం వంటింట్లో మహిళలకు అవసరమైన నిత్యావసర సరుకుల ధరల హెచ్చు తగ్గుల కార్యకలాపాలు పరిశీలించే వారు కొరవడడంతో తగ్గించిన ట్యాక్స్‌లకు తగ్గట్లు సరుకుల ధరలు తగ్గించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సిమెంట్ ధరలో కొద్దిపాటి మార్పులు వచ్చి జీఎస్టీ వలన రూ.30లు తగ్గించినట్లు కనిస్తోంది. మిగతా నిత్యావసర సరుకుల ధరలు యథాతథంగానే కొనసాగుతున్నాయని తద్వారా పేదలపై భారం పడుతోందని వాపోతున్నారు. జీఎస్టీ ఉన్నతాధికారులు స్పందించి తగ్గిన ధరలకు అనుగుణంగా కొనుగోలు దారులకు సరుకులు లభ్యమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జీతాల బకాయి చెల్లింపునకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్

పార్వతీపురం రూరల్: 'అమ్మను కాపాడే అతివకే గండం' అని బుధవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఐటీడీఏ ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారి స్పందించారు. గిరిజన గర్భిణుల వసతిగృహాల సిబ్బందికి బకాయి పడిన పదినెలల జీతాలను చెల్లించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు, అలాగే భవిష్యత్‌లో వసతిగృహాలకు పూర్తిస్థాయి పోస్టులు మంజూరైతే వారికే ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.

చికెన్	బ్రాయిలర్	
లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹135	₹240	₹250

సీఆర్‌పీఎఫ్ బలగాల స్వచ్ఛతా హి సేవ

మక్కువ: మండలకేంద్రం మక్కువలో సీఆర్‌పీఎఫ్ ఈ–198బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎస్‌హెచ్.రాజకుమార్ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ బలగాలు గురువారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు వీధులను శుభ్రంచేశారు. చెత్తను పోగుచేసి, డంపింగ్‌యార్డుకు తరలించారు. అలాగే ఎంపీడీవో ఎం.అర్జునరావు, డిప్యూటీ ఎంపీడీవో ఎన్.సూర్యనారాయణ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశవర్కర్లు, వైద్య సిబ్బంది, ఎన్‌ఆర్‌ఈజీఎస్, వెలుగు, మండలపరిషత్ కార్యాలయం సిబ్బంది ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగించారు.



మక్కువలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం చేపట్టిన సీఆర్‌పీఎఫ్ బలగాలు

గిరిజన గర్భిణి వసతిగృహాల సిబ్బందిని కొనసాగించాలి



కలెక్టరేట్ వద్ద గిరిజన గర్భిణుల వసతిగృహాల సిబ్బందితో కలిసి మాట్లాడుతున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం, గిరిజన సంక్షేమసంఘం నాయకులు

పార్వతీపురం రూరల్: గిరిజన గర్భిణుల వసతిగృహాల్లో పనిచేస్తున్న సిబ్బందిని కొనసాగించాలని, అలాగే వారికి బకాయి పడిన 40నెలల వేతనాలను తక్షణమే చెల్లించాలని ఏపీ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ జేఏసీ, గిరిజన సంక్షేమసంఘం నాయకులు బీవీ రమణ, పి.రంజిత్ కుమార్‌లు డిమాండ్ చేశారు.ఈ మేరకు గురువారం కలెక్టరేట్ వద్ద సిబ్బందితో కలిసి వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రశంసలు పొంది యునెస్కో, నీతి అయోగ్ వంటి సంస్థల మన్ననలు అందుకున్న గిరిజన గర్భిణుల వసతిగృహాల నిర్వహణ సిబ్బందిపై అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూ సిబ్బందిని తొలగించాలని ఆలోచన చేయడం పై మండిపడ్డారు. కార్యక్రమంలో కరణం త్రివేణి, అలమండ రాములమ్మ, డి.దేవి, నాగమణి, నందిని పాల్గొన్నారు.